క్లుప్తంగా

నేడు జిల్లాకేంద్రంలో విద్యుత్ కోత

నారాయణపేట: జిల్లాకేంద్రంలో 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ మహ్మద్ రఫీ శనివారం తెలిపారు. సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంతం, డంపింగ్ యార్డ్, ప్రతిభ కళాశాల వెనుక భాగం, శాతవాహనకాలనీ, ఎస్సీకాలనీ, పళ్ల హనుమాన్ ఆలయ ప్రాంత, గురుకుల పాఠశాల రోడ్, ఎక్లాస్‌పూర్ రోడ్, యాద్గిర్‌రోడ్ ఇండస్ట్రియల్ ఏరియా తదితర ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతోందని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు ఉచిత వైద్యశిబిరం

మరికల్: యువక మండలి ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్వహించే ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు యువక మండలి అధ్యక్షుడు రవికిరణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్నిరకాల వైద్యపరీక్షలు చేసే ప్రత్యేక వైద్యులచే చికిత్సలు చేయిస్తామన్నారు. ఆరోగ్య సమస్యలు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

8న చలో కలెక్టరేట్

ఊట్కూరు: ప్రజా సమస్యలను విజయవంతం చేయాలని కోరుతూ సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ఆధ్వర్యంలో ఈ నెల 8న చేపట్టిన చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలని సబ్ డివిజన్ కార్యదర్శి సలీం డిమాండ్ చేశారు. శనివారం పులిమామిడిలో వాల్‌పోస్టర్లు, కరపత్రాలను విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెలలు గడుస్తున్నా నేటికి రైతుభరోసా పింఛన్లు, కొత్త పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు తది తర పథకాలను చేపట్టలేదన్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తమపార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు. చెన్‌రాములు, వెంకటేష్, రాజేశ్వరీ, అంజమ్మ, నర్సింహులు పాల్గొన్నారు.

కంది పంట పరిశీలన



కోస్గి: మున్సిపల్ పరిధిలోని పోతిరెడ్డిపల్లిలో శనివారం వివిధ పంటలను ఏఓ రామకృష్ణ పరిశీలించారు. అధిక వర్షాలతో పంటలకు తెగుళ్ల సోకినట్లు రైతులు ఫిర్యాదు చేయడంతో పంటలను క్షేత్రస్థాయిలో పరిశీలించినట్లు ఏఓ తెలిపారు. కంది పంటలో కాండం ఎరుపు తెగులు, ఎండు తెగులు గుర్తించామని, ఈ తెగుళ్ల నివారణకు కాపర్ ఆక్సిక్లోరైడ్ శిలింద్ర నాశినిని పిచికారి చేయాలన్నారు. పత్తిలో పెను బంక, నల్లి, రసం పీల్చే పురుగులను గుర్తించామని, వీటి నివారణకు ఆస్పెట్, ఇమిడా మందులు పిచికారి చేసుకోవాలని సూచించారు.

బదిలీపై వెళ్తున్న సిబ్బందికి సన్మానం

మాగనూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న సురేష్, అటెండర్‌గా విధులు నిర్వహిస్తున్న అనుమ్మవ్వ బదిలీపై వెళ్లడంతో వారిని శాలువాతో సత్కారించారు. ఈ మేరకు.. తహసీల్దార్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డీటీ సతీష్‌కుమార్, ఆర్ఐ శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మెహందీ వేడుకలు



కోస్గి: ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని శనివారం వీరశైవ మండల సమాజం, అక్క మహాదేవి మహిళా మండలి సంయుక్త ఆధ్వర్యంలో మెహందీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక శ్రీ భ్రమరంభ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో జరిగిన ఈ వేడుకలకు పలువురు మహిళలు హాజరై మెహందీ పెట్టించుకున్నారు. ఆషాఢ మాసంలో మహిళలు మెహిందీకి ఎంతో ప్రాముఖ్యత నివ్వడంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ మేరకు.. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అక్కమహాదేవి సంఘం ప్రతినిధులతో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.

తల్లిదండ్రులు పిల్లలపై దృష్టి సారించాలి

ధన్వాడ: విద్యార్థులు కళాశాలకు వెళ్తున్నారా? లేదా రోజు సెల్‌ఫోన్‌లు వాడుతున్నారనే విషయాలను తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని కళాశాల ప్రిన్సిపాల్ అబ్దుల్ ముజీబ్ అన్నారు. శనివారం కళాశాలలో తల్లిదండ్రుల సమావేశం నిర్వహించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ సెల్‌ఫోన్ ఎక్కువ వాడటంతో విద్యార్థుల్లో చదువుపై దృష్టి తగ్గిపోతుందని, సెల్‌ఫోన్ వాడకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రులకు ఉంటుందన్నారు. ప్రతి రోజు కళాశాలకు యూనిఫామ్‌లో పంపాలని, ఇచ్చిన పాఠాలు ఇంటి వద్ద చదివేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.



బస్టాండ్ లేక కష్టాలు..!



మాగనూర్‌లో బస్సుకోసం ఎదురు చూస్తున్న ప్రయాణికులు (ఫైల్)

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- హోటళ్లనే స్టాప్‌లుగా మల్చుకుంటున్న వైనం
- పట్టించుకోని అధికారులు

మాగనూర్: ఇక్కడ బస్టాండ్ లేక రోడ్ల పక్కన, హోటళ్లు, దుకాణాల వద్ద బస్సుల కోసం నిరీక్షిస్తూ బస్సు ఎక్కాల్సిన దుస్థితి నెలకొందని, ఇది పాలకుల పనితీరుకు అద్దం పడుతుందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాగనూర్‌లో బస్టాండ్ లేకపోవడంతో ప్రయాణికులు, ప్రజలు ఏళ్ల తరబడి ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్ నిర్మాణానికి ఎవరూ చొరవ చూపడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి బస్టాండ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఒక పంచాయతీలోనే బస్టాండ్..

మండలంలోని మొత్తం 16 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వీటిలో కొత్తపల్లిలో తప్ప ఇతర గ్రామాల్లో బస్టాండ్, రేకుల షెడ్లు (బస్‌షెల్టర్)కాని లేవు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రోడ్లు, హోటళ్లనే బస్టాండ్‌లుగా మార్చుకుంటున్నారు. వర్షాకాలంలో ప్రయాణికుల ఇబ్బందులు తీవ్రంగా ఉంటాయి. మండల కేంద్రానికి నిత్యం వివిధ పనుల నిమిత్తం ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. కాని బస్టాండ్ నిర్మించకపోవడంతో తాగునీటి సౌకర్యం, మూత్రశాలలు, మరుగుదొడ్లు వంటి కనీస సౌకర్యాలు ప్రజలకు దూరమయ్యాయి. హోటళ్లలను ఆశ్రయంగా చేసుకుని రాకపోకలు సాగిస్తున్నారు. అయితే మండలం నుంచి ఆయా గ్రామాలకు వెళ్లే బస్సులకోసం పట్టణాలకు కాని ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మహిళల అవస్థలు..

మండల కేంద్రానికి వచ్చే ప్రయాణికులు కనీస అవసరాలు తీర్చుకునేందుకు ఇబ్బంది పడుతున్నారు. మూత్రశాలలు, మరుగుదొడ్లు లేకపోవడంతో మహిళలు ఇక్కట్లకు గురువుతున్నారు. దీంతో మండల కేంద్రానికి రావాలంటే ప్రయాణికులు జంకుతున్నారు. గతంలో అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. ఇప్పటికైనా మండల కేంద్రంతో పాటు గ్రామాలల్లో బస్టాండ్ నిర్మాణంతోపాటు ఇతర సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని మండల వాసులు కోరుతున్నారు.

సౌకర్యాలు కల్పించాలి..



వివిధ పనుల నిమిత్తం ప్రజలు మండల కేంద్రానికి వస్తుంటారు. కాని ఇక్కడ బస్టాండ్, మరుగుదొడ్లు వంటి సౌకర్యం లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు బస్టాండ్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– అశోక్‌గౌడ్, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి

ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి



మండల కేంద్రంలో ఎన్నో ఏళ్లు గడుస్తున్న బస్టాండ్ నిర్మాణానికి నోచుకోవడం లేదు. ముఖ్యంగా వర్షాకాలం ప్రయాణికుల కష్టాలు ఎక్కువ అవుతున్నాయి. మహిళలకు ఒకటికి, రెండికి తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అధికారులు ప్రయాణికుల ఇబ్బందులు తీర్చాలి.

– రమేష్, బీఎస్పీ మండల అధ్యక్షుడు, మాగనూర్

స్థలం కేటాయిస్తే నిర్మాణం చేపడుతాం..



మండల కేంద్రంలో బస్టాండ్ లేదని విషయం తమ దృష్టికి వచ్చింది. అయితే బస్టాండ్ నిర్మించాలంటే ప్రధానంగా స్థలం కావాలి. అయితే బస్టాండ్ నిర్మాణానికి స్థలం కొరత ఉంది. గ్రామ పంచాయతీ వారు స్థలం చూయిస్తే బస్టాండ్ నిర్మాణ పనులు ప్రారంభిస్తాం. అదేవిధంగా వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాత్కాలిక ప్రయత్నం చేపడుతాం.

– లక్ష్మీసుధా, డిపో మెనేజర్ నారాయణపేట

చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో పురుగుల అన్నం

ఊట్కూర్ : మండలంలోని చిన్నపొర్ల ఉన్నత పాఠశాలలో శనివారం పురుగుల అన్నం వడ్డించడంతో విద్యార్థులు ఇంటికి వెళ్లి భోజనం చేశారు. పాఠశాలలో బియ్యం శుభ్రం చేయకుండా అలాగే అన్నం వండడంతో వడ్డించే సమయంలో అన్నంలో పురుగుల రావడంతో విద్యార్థులు మధ్యాహ్న భోజన నిర్వాహకులను నిలదీశారు. విషయం తెలుసుకున్న పెద్దపొర్ల చెందిన పలువురు తల్లిదండ్రులు పాఠశాలకు వచ్చి భోజనం పరిశీలించారు. అన్నంలో పురుగులు ఉండడంతో వారు ఉపాధ్యాయులను నిలదీశారు. వెంటనే శుభ్రపరిచిన బియ్యంతో అన్నం వండి పలువురు విద్యార్థులకు వడ్డించారు. ఇన్‌చార్జి హెచ్‌ఎం సత్యనారాయణను వివరణ కోరగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు బియ్యం శుభ్రపరచకుండా అలాగే వండడంతో అన్నంలో పురుగులు వచ్చాయని తెలిపారు. సోమవారం హెచ్‌ఎం వచ్చిన వెంటనే తల్లిదండ్రులతో సమావేశం ఏర్పాటు చేసి మధ్యాహ్న భోజన నిర్వాహకులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.



చిన్నపొర్లలో విద్యార్థులకు వడ్డించిన అన్నం

నంబర్‌ప్లేట్ తప్పనిసరి

నారాయణపేట రూరల్: వాహనదారులు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు ఉంటాయని ఏఎస్ఐ ఆంజనేయులు హెచ్చరించారు. శనివారం పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో వాహనాల తనిఖీలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. కారు అద్దాలకు బ్లాక్ ఫిలిం ఉపయోగించొద్దని, ఎంవీ యాక్ట్ ప్రకారం రూ.735 జరిమానా ఉంటుందన్నారు. ప్రతి వాహనానికి నంబర్‌ప్లేట్ తప్పనిసరిగా ఉండాలన్నారు. వాహనం నడిపే సమయంలో హెల్మెట్, సీటుబెల్టును ఉపయోగించాలని, అవి మన ప్రాణాలను కాపాడుతాయన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం చట్టరిత్యా నేరమని అందుకు వాహన యజమానులు, పిల్లల తల్లిదండ్రులు శిక్షార్హులన్నారు. వాహనాలను రోడ్లపై ఇష్టారీతిగా పార్కింగ్ చేయొద్దన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న ఏఎస్ఐ ఆంజనేయులు

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: ప్రతి ఒక్కరూ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని శిశు సంక్షేమ శాఖ కౌన్సిలర్ విజయ్‌కుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జెడ్పీ పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు బాలల హక్కులు, చట్టాలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.. బాలల హక్కులు, విద్యాహక్కు చట్టం బాలకార్మిక చట్టం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా విద్యార్థులకు ఎదురయ్యే సమస్యలు వాటిని ఎదుర్కొవడానికి చైల్డ్‌హెల్ప్‌లైన్ 1098ప విధంగా వినియోగించుకోవాలో తెలియజేశారు. కార్యక్రమంలో చైల్డ్ హెల్ప్‌లైన్ కౌన్సిలర్ విద్యారాణి, సూపర్‌వైజర్ బాలరాజు, పాఠశాల హెచ్‌ఎం మురళీ ధర్‌రెడ్డి, సీఆర్పీ కృష్ణయ్య, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఘనంగా లక్ష బిల్వార్చన

మరికల్: మండలంలోని భ్రమరాంబిక మల్లికార్జునస్వామి ఆలయంలో శనివారం ఘనంగా లక్ష బిల్వార్చన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నేరేడుగం పీఠాధిపతి పంచసిద్ది లింగేశ్వరస్వామి హాజరయ్యారు. భక్తులచే లక్షబిల్వార్చన కార్యక్రమం చేయించారు. అనంతరం స్వామివారిని సన్మానించి పూజలు చేశా రు. జగదీష్, సోమనాథం, వీరన్న, బసంత్, శివప్రసాద్, శివకుమార్ పాల్గొన్నారు.

ప్రొటోకాల్‌పై బీజేపీ, కాంగ్రెస్‌ల రగడ

నర్వ: ప్రాథమిక సహకార కేంద్రంలోని పాలకవర్గం చేపట్టిన ఎరువుల దుకాణం, సీసీబెడ్ల నిర్మాణం ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ రగడ చోటుచేసుకుంది. పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అధ్యక్షతన చేపట్టిన కార్యక్రమంలో ప్రారంభానికి ముందే ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి హాజరయ్యారు. ఎంపీ డీకే అరుణ కోసం అరగంటపాటు వేచి చూశారు. ఆ తర్వాత ఎంపీ డీకే. అరుణ రాగానే కార్యక్రమం ప్రారంభమైంది. ముందే బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, పీఏసీఎస్ మాజీ చైర్మన్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి శిలాఫలకంపై కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చెన్నయ్యసాగర్ పేరు ఎందుకు ఉందని అనడంతో వివాదం రేగింది. ఇరుపార్టీల నాయకులు ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోగా ఎమ్మెల్యే, ఎంపీలు వారించి శాంతింపజేశారు. అనంతరం ఇద్దరు రైతులనుద్దేశించి మాట్లాడుతూ.. అభివృద్ధిలో పార్టీలకతీతంగా పనిచేయాలన్నారు. పేర్లకోసం కాకుండా గెలిపించిన ప్రజల కోసం మనం ఏమి చేశామన్నదే గుర్తుండి పోతుందన్నారు. ఏ భేషజాలు లేకుండా కలసి పనిచేసుకుందామన్నారు. ప్రొటోకాల్ కోసం అధికారులు సలహా తీసుకుని ఏర్పాటు చేయాలని లేదంటే వివాదాలు ఏర్పడతాయన్నారు.



నాయకులను వారిస్తున్న ఎంపీ డీకే అరుణ, ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి

అనంతరం దుకాణాలు ప్రారంభోత్సవం చేస్తుండగా మళ్లీ బీజేపీ కార్యకర్తలు ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి పేరు లేదనడంతో వివాదం చెలరేగి అక్కడి నుంచి కార్యక్రమాన్ని వాకౌట్ చేసి ఎంపీ డీకే అరుణ కార్యకర్తల నినాదాలతో బయటకు వెళ్లిపోయారు. అనంతరం ఎమ్మెల్యేను పీఏసీఎస్ పాలకవర్గం, కాంగ్రెస్ కార్యకర్తలు పట్టుబట్టడంతో శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఎస్ఐ కుర్మయ్య, అదనపు బలగాలతో గొడవ జరగకుండా చర్యలు చేపట్టారు. వైస్ చైర్మన్ లక్ష్మన్న, నాయకులు చెన్నయ్యసాగర్, జగన్‌మోహన్‌రెడ్డి, సిద్దార్థరెడ్డి, రవీందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, శరణప్ప, వివేవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోవాలి

నారాయణపేట: జిల్లాలోని చేనేత, ఉన్ని, సిల్క్ సహకార సంఘాల అధ్యక్షులకు, చేనేత కార్మికులకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన నేతన్న బీమా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా చేనేత అభివృద్ధి అధికారి బాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకంలో (2024–25) పాలసీ సంవత్సరానికి చేరడానికి 18 ఏళ్ల ఆధార్ ప్రకారం వయస్సు నిండిన చేనేత వృత్తిలో కొనసాగుతూ కొత్త సభ్యులు చేనేత, అనుబంధ కార్మికులు అర్హులని తెలిపారు. వివరాలకు సహాయ సంచాలకులు చేనేత, జౌళిశాఖ జిల్లా కార్యాలయంలో సంప్రదించి ఈనెల 8లోగా దరఖాస్తుచేసుకోవాలని కోరారు.

పీహెచ్‌సీలో ఆకస్మిక తనిఖీ

మక్తల్: పిల్లలకు టీకాలను సరియైన సమయంలో వేయించుకోవాలని డీఎంహెచ్ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి అన్నారు. శనివారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు.. పిల్లలకు సరియైన సమయంలో టీకాలు వేయించుకోవాలని కోరారు. ప్రభుత్వ ఆస్పత్రిలో కాన్పులను పెంచాలన్నారు. వైద్యసిబ్బంది రోగులకు ఏమాత్రం నిర్లక్ష్యంగా వ్యహరించొద్దన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంత్ , డాక్టర్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు వినతి



కోస్గి: గతంలో అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీమేరకు బీసీ కులగణన చేసిన తర్వాతనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని పలువురు బీసీ సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వం వెంటనే బీసీ కులగణనకు షెడ్యూల్డ్ ప్రకటించాలని, హామీ మేరకు 42శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహులు, బీసీ నాయకులు కోటకొండ రాము, గోపాల్, వెంకటేష్, అనంతయ్య పాల్గొన్నారు.

గుర్తుతెలియని మృతదేహం లభ్యం

కృష్ణా: మండల పరిధిలోని కృష్ణా బ్రిడ్జిపై శనివారం గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతదేహం లభించింది. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఉదయం బ్రిడ్జిపై ప్రయాణించే వాహనదారులు ఓ వ్యక్తి మృతిచెంది ఉన్నాడని గమనించి స్థానిక ఎస్ఐ ఎండీ నవీద్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని విచారించారు. గుర్తుతెలియని వ్యక్తి(35) మృతిచెందాడని, ఆయన మెడపై కత్తి గాట్లు ఉన్నాయని తెలిపారు. ఈ వ్యక్తి ఆచూకీ లభించలేదని, వివరాలు తెలియాల్సి ఉందన్నారు. కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించినట్లు తెలియజేశారు.

నేడు చౌడేశ్వరీ మాతా జయంతి

కోస్గి: చౌడేశ్వరీ మాతా జయంతిని పురస్కరించుకొని ఆదివారం పట్టణంలో చౌడేశ్వరీ మాతా దేవాలయంలో జయంతి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ప్రతినిధులు ప్రకటనలో తెలిపారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం అమ్మవారికి పంచామృతాభిషేకం, పుష్పాలంకరణతోపాటు ప్రత్యేక పూజలు ఉంటాయన్నారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై ఉత్సవాలను విజయవంతం చేయాలన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

కోస్గి: పుట్టిన బిడ్డకు తల్లిపాలు అమృతంతో సమానమని సీడీఎస్ సూపర్ వైజర్ సరోజ అన్నారు. ఈ మేరకు శనివారం పట్టణంలోని మున్నూర్ వీధిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ముర్రు పాలలో రోగ నిరోధక శక్తి ఉంటుందని బిడ్డ ఆరోగ్యంగా ఉండాలంటే తల్లి ముర్రు పాలు తాగించాలని అన్నారు. ఎప్పటికప్పుడు చిన్నారుల బరువును చూయించుకొని తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కోడిగంటి అన్నపూర్ణ, అంగన్‌వాడీ టీచర్ ప్రసన్న, బాలింతలు, గర్భిణులు తదితరులు పాల్గొన్నారు.

ఊట్కూరు: తల్లిపాలే బిడ్డకు శ్రేయస్కరమని ఏఎన్ఎం సుజాత అన్నారు. శనివారం మండలంలోని అమీన్‌పూర్, అవుసలోనిపల్లి, నిడుగుర్తి, ఊట్కూరు తదితర గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాలలో తల్లిపాల వారోత్సాలు నిర్వహించారు. ఈ మేరకు.. బాలింతలు, గర్భిణులకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శ్రేష్టమైనవని, ఆరు నెలల వరకు చిన్న పిల్లలకు విధిగా తల్లిపాలను తాగించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు ఆనందమ్మ, మంజుల, వరలక్ష్మీ, రామలింగమ్మ పాల్గొన్నారు.



కోస్గిలో మాట్లాడుతున్న సూపర్ వైజర్ సరోజ

'స్వచ్ఛదనం- పచ్చదనం' విజయవంతం చేద్దాం



మాగనూర్‌లో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి ఖలీల్

మాగనూర్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని మండల ప్రత్యేక అధికారి ఖలీల్ అన్నారు. శనివారం మండల అధికారుల సమావేశం స్థానిక ఎంపీడీఓ భవనంలో నిర్వహించారు. ఈ మేరకు.. ఆయన మాట్లాడుతూ.. కలెక్టర్ ఆదేశాల ప్రకారం ఈ నెల 5నుంచి 9 వరకు స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రతి రోజు చేయవలసిన కార్యక్రమాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ విజయలక్ష్మి, ఏపీఎం వనిత కూమారి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక



కోస్గిలో విద్యార్థినులను అభినందిస్తున్న హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి

కోస్గి: గుండుమాల్ మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు జిల్లాస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం శేఖర్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలో ఈ నెల 2న జిల్లాస్థాయిలో నిర్వహించిన అథ్లెటిక్స్ పోటీలో బాలికల విభాగంలో పాఠశాలకు చెందిన విద్యార్థినులు జావలిన్‌త్రో పోటీల్లో దస్తమ్మ, లావణ్య, స్వప్న ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన విద్యార్థినులు ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొంటారని పీడీ తెలిపారు. ఈ మేరకు ఎంపికైన విద్యార్థినులను శనివారం జీహెచ్‌ఎం శేఖర్‌రెడ్డి, ఇన్‌చార్జి హెచ్‌ఎం రవీందర్ రెడ్డి, పీడీ స్వప్న అభినందించారు.



విద్యార్థులను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి క్రీడా పాఠశాలకు ఎంపిక

మాగనూర్: మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో నాల్గో తరగతి చదువుతున్న యశ్వంత్‌గౌడ్, తిరుమలేష్ ఎంపికైనట్లు ఉపాధ్యాయురాలు దీప అన్నారు. శనివారం పాఠశాలలో విద్యార్థులను కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. ఆమె మాట్లాడుతూ.. ఎంపికైన విద్యార్థులకు ఇంటర్మీడియట్ వరకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారాన్ని ప్రభుత్వం ఉచితంగా అందజేస్తుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్, బాలుర వసతిగృహం వార్డెన్ అబ్జల్ అహ్మద్, గ్రామ పెద్దలు వాకిటి శ్రీనివాసులు, రాజప్పగౌడ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలి



భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మక్తల్: ఫీజు రియింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు వెంటనే విడుదల చేయాలని పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం విద్యార్థుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం అందిస్తామని ప్రభుత్వాలు ప్రకటించిన ఇప్పటివరకు అమలు చేయడం లేదన్నారు. వెంటనే విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని ఆయన కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ భూపాల్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ శేఖర్, అజయ్, వెంకటేష్, బాలు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి ఫలితం దక్కింది



కోస్గిలో అంబేద్కర్ విగ్రహం వద్ద సంబరాల్లో పాల్గొన్న నాయకులు

కోస్గి: దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణ తీర్పు చరిత్రాత్మకమని ఎమ్మార్పీఎస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు శనివారం పలు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని పుర వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక శివాజీ చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట సంబురాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు.. సుదీర్ఘకాలం పాటు పోరాటం చేయడంతోనే చరిత్రాత్మక ఫలితం దక్కిందని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు బ్యాగరి రాములు, ఉమ్మడి పాలమూరు జేఏసీ అధ్యక్షుడు కామారం వెంకటేష్‌తోపాటు పలు సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మరికల్: ఎస్సీ వర్గీకరణ కోసం 30ఏళ్ల నుంచి చేసిన పోరాటాల ఫలితమే వర్గీకరణ సాధ్యమైందని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుల రామస్వామి, గోపాల్, బాల్‌రాజ్ అన్నారు. ఎస్సీ వర్గీకరణకు సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తు శనివారం టీఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మండలంలోని చౌరస్తాలో అంబేడ్కర్, జ్యోతిరావు పూలే చిత్రపటాలకు పాలభిషేకం చేశారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, కృష్ణయ్య, వెంకటయ్య, బాలకృష్ణ, శివ, రామకృష్ణారెడ్డి, కమల్, చంద్రకాంత్, గోవర్దన్ పాల్గొన్నారు.



మరికల్‌లో..

మాగనూర్: మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో మంద కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు.. నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీస్ జిల్లా అధ్యక్షుడు కర్రెప్ప, నాగేష్, హన్మంతు, రామస్వామి, మణిగిరి కృష్ణ, సంజీవ్, గజపతి, దినేష్, పెద్దింటి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో..

నర్వ: రైతులకు బహిరంగ మార్కెట్ కంటే తక్కువ ధరకే ఎరువులు, క్రిమిసంహారక మందులు, వ్యవసాయ పరికరాలు అందించేందుకు కృషిచేస్తామని పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం పీఏసీఎస్‌లో ఫార్మర్స్ డేను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. హెల్లో క్రాప్స్ కంపెనీ సహకారంతో రైతులకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు కంపెనీతో టయప్ అయ్యామన్నారు. కంపెనీ బిజినెస్ హెడ్ సత్యపాల్ మాట్లాడుతూ.. రైతులకు పురుగుల మందుల వాడకంలో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. తెగుళ్ల నివారణ కోసం చేపట్టాల్సిన చర్యలపై వివరించారు. గ్రామీణ ప్రాంతాల రైతుల కోసం ఎరువులు, విత్తనాలు, స్ప్రేయర్స్, టార్పలీన్‌లు అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ లక్ష్మన్న, సీఈఓ ఉదయ్, డైరెక్టర్లు వివేకవర్ధన్‌రెడ్డి, రామేశ్వర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లెశేఖర్, రాములు నాయక్ పాల్గొన్నారు.

